మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కుర్మల్‌గూడలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను నిలదీస్తున్న రైతులు

## సంక్షేమ పథకాలకు వేర్వేరు గుర్తింపు కార్డులు

- త్వరలో కొత్త పెన్షన్లు జారీచేస్తాం
- వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్/బడంగ్‌పేట , ఆగస్టు 4(నమస్తే తెలంగాణ): రేషన్, సంక్షేమ పథకాలకు వేర్వేరు గుర్తింపు కార్డులు ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వం చర్చిస్తుందని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. కొత్త పెన్షన్లు సైతం త్వరలో మంజూరు చేస్తామన్నారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి ఆదివారం ఆయన సచివాలయంలో ప్రజావాణి పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజావాణిలో అవకాశం ఉన్న ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

### రైతులకు ముఖం చాటేసిన భట్టి

సమస్యలు విన్నవించేందుకు తమకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమయం ఇవ్వకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడ నల్లపోచమ్మ ఆలయంలో జరిగే బోనాల ఉత్సవాలకు భట్టి హాజరవుతున్నారని తెలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు కుర్మల్‌గూడ, నాదర్‌గుల్ రైతులు భారగీ తరలివచ్చారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు.

## 15 తర్వాత వైటీపీఎస్ ట్రయల్‌రన్

- రెండు యూనిట్లలో అధికారుల ఏర్పాట్లు
- వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి
- అధికారులకు డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చే యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంట్ ట్రయల్ రన్‌కు సిద్ధమవుతున్నది. ఈ నెల 15 తర్వాత ఒక యూనిట్‌లో ట్రయల్‌రన్‌కు జెన్‌కో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్లాంట్‌లోని రెండు యూనిట్లలోని బాయిలర్లను టీఎస్ జెన్‌కో అధికారులు ఇటీవలే వెలిగించారు. యూనిట్ -1, యూనిట్ -2 అగ్నిలరీ బాయిలర్లను మే 14న వెలిగించారు. ప్రస్తుతానికి నార్మలైజేషన్ ప్రక్రియను చేపట్టనుండగా, ఇది ముగిసిన తర్వాత ఈ నెల 15 నుంచి ట్రయల్‌రన్‌ను చేపట్టాలని నిర్ణయించారు. ఈ నెలాఖరులో యూనిట్ -2లో విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

### టార్గెట్ మార్చి - 2025

వచ్చే ఏడాది మార్చికల్లా వైటీపీఎస్‌లో ఐదు యూనిట్లను పూర్తి చేసి విద్యుత్తును ఉత్పత్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి రొనాల్డ్‌రాస్, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, జెన్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ సమయ్య పాల్గొన్నారు.

## అమెరికాలో సీఎం బిజీబిజీ

హైదరాబాద్, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ) : అమెరికా పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. శుక్రవారం రాత్రి అమెరికా చేరుకున్న ఆయనకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు జేకేఎఫ్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా, దక్షిణకొరియా పర్యటనకు వెళ్లిన సీఎం.. ఐటీ, హెల్త్‌కేర్, మ్యాను ఫ్యాక్చరింగ్ రంగాలకు చెందిన పలు కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

## రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు ఏంటి?

**బీజేపీ నేతలతో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ఆరా**

హైదరాబాద్, ఆగస్టు4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయి? పార్టీ పరిస్థితి ఏంటి? అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పార్టీ నేతలను కలిసి ఆరా తీశారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసి రైతు సహాయ కేంద్రం(హెల్ప్ లైన్)ను సందర్శించారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలపై చర్చించారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు

**తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్**

అడ్డగూడూరు, ఆగస్టు 4 : ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యత కాంగ్రెస్ కార్యకర్తలకే ఇస్తామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సూర్యాపేట జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వలో ఆదివారం పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. అంతకు ముందు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరైనట్టు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు ముందుగు ఇండ్లు ఇవ్వాలని, ఆ తరువాత ఇతర పార్టీల వారికి ఇవ్వాలని సూచించారు.

గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో ఎరువుల తయారీకి ఉపయోగించిన కంపోస్టు షెడ్డు

ప్రస్తుత సర్కారు హయాంలో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్ది గ్రామంలో ఇష్టారాజ్యంగా చెత్త వేయడంతో డంప్‌యార్డుగా మారిన కంపోస్టు షెడ్డు

# ధనమే లేని 'స్వచ్ఛదనం-పచ్చదనం'

మొదటిపేజీ తరువాయి...

ఇదే నెల 9 వరకు 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమం చేపట్టేందుకు ముందుకొచ్చింది. కానీ నిధులు కేటాయించకుండా ప్రత్యేక కార్యక్రమంలో పనులెలా చేయాలంటూ పంచాయతీల కార్యదర్శులు గగ్గోలు పెడుతున్నారు. పల్లెల దుస్థితిపై బీఆర్‌ఎస్ నిలదీయడంతోనే సర్కారులో కదలిక వచ్చి ఈ కార్యక్రమం చేపట్టేందుకు చొరవ చూపింది. గ్రామ పంచాయతీలకు గత కొన్ని నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ట్రాక్టర్ల డిజిల్ డబ్బుల్లేక, నిర్వహణ వ్యయం భారమై ఎక్కడివి అక్కడే మూలకు పడ్డాయి. వేతనాలు ఇవ్వకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు పనులు బంద్ చేయడంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

| 'స్వచ్ఛదనం-పచ్చదనం' షెడ్యూల్ | |
|---|---|
| వారం | ప్రత్యేక కార్యక్రమాలు |
| సోమవారం | స్వచ్ఛదనం-పచ్చదనం ప్రారంభోత్సవ కార్యక్రమం |
| మంగళ వారం | తాగునీరు, వర్షపు నీటి సంరక్షణ |
| బుధవారం | నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతల పురుషుల పూడ్చివేత |
| గురువారం | కుక్కల బెడద నివారణతో పాటు ప్రజారోగ్యంపై శ్రద్ధ పెట్టడం |
| శుక్రవారం | ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాల శుభ్రత |

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఈ వేతనాలు మినహా పంచాయతీలకు మరే నిధులను ఇవ్వలేదు. ఇంతలోనే చేపట్టనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి నిధులు విడుదల చేయకుండా పనులెలా సాధ్యమని పంచాయతీల కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చేసిన పనులకు అప్పులపాలై ఉన్నామని, కొత్తగా డబ్బులు ఎక్కడి నుంచి తేవాలంటూ కార్యదర్శులు లబోదిబోమంటు న్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమ పర్యవేక్షణకు రెండు జిల్లాలకు ఒకరి చొప్పున ప్రత్యేకంగా 16 మంది ఐఏఎస్ అధికారులను పర్యవేక్షకులుగా ప్రభుత్వం నియమించింది. గ్రామస్థాయిలో పంచాయతీ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్, స్థానిక ప్రజలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆ శాఖ ఏర్పాట్లు చేసింది.

### అబ్బాపురంలో ప్రారంభించనున్న మంత్రి సీతక్క

ములుగు మండలం అబ్బాపురం గ్రామంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. అనంతరం మంగపేట మండల కేంద్రంలో జరిగే అవగాహన సదస్సులో మంత్రి పాల్గొంటారు. పల్లెల రూపురేఖలు మార్చేలా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు. 'నా గ్రామం నా గౌరవం' నినాదంతో గ్రామస్థులంతా పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని కోరారు.

## వయనాడ్ విలయాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలి

**మంత్రి శ్రీధర్‌బాబు**

హైదరాబాద్, ఆగస్టు 4(నమస్తే తెలంగాణ) : కేరళ రాష్ట్రంలోని వయనాడ్ విలయాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. దీనిని కేవలం ఓ రాష్ట్ర సమస్యగా పరిగణించి వదిలేయాలని చూస్తే జాతి క్షమించదని పేర్కొన్నారు. దక్షిణాదిలో ఇలాంటి ఘటన గతంలో ఎప్పుడూ జరుగలేదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విలయాన్ని కేంద్రం రాజకీయ కోణంలో కాకుండా మానవీయ దృక్పథంతో చూడాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలను మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఉపగ్రహ చిత్రాల ద్వారా హెచ్చరికలను జారీ చేసే వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరారు.

# భూమాత పేరిట రెండు లక్షల కోట్ల స్కాం

- 'మహేశ్వరం ఫోర్త్ సిటీ' వెనుక కాంగ్రెస్ భూదందా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

మాట్లాడుతున్న మంత్రి బండి సంజయ్

బడంగ్‌పేట, ఆగస్టు 4 : మహేశ్వరాన్ని ఫోర్త్ సిటీగా మారుస్తామని ప్రకటించడం వెనుక కాంగ్రెస్ భూదందా కుట్రలు దాగి ఉన్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. వేల ఎకరాలను సేకరించి దోచుకునేందుకు ఓ కాంగ్రెస్ నాయకుడికి బాధ్యతలు అప్పగించారని, ఇప్పటికే ఆ నాయకుడు వెయ్యి ఎకరాల భూమిని తీసుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని గుర్రంగూడలో ఆదివారం బోనాల ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహేశ్వరంలో కాంగ్రెస్ నాయకులు భూములను సేకరించి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో వేల కోట్లు కొల్లగొడుతున్నారని చెప్పారు. ఆస్తులు కూడబెట్టేందుకు కాంగ్రెస్ ఇది మంచి అవకాశంగా తీసుకుంటున్నదని, 2 లక్షల కోట్ల స్కాం జరగబోతున్నదని, 'భూమాత'తో భూమిని కాజేసే కుట్ర జరుగుతున్నదని విమర్శించారు.

### 'స్థానికం' కోసమే రుణమాఫీ డ్రామా

గత ప్రభుత్వం 36లక్షల మందికి రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 18లక్షల మందికే చేయడం సిగ్గుచేటని, 70 శాతం మందికి రుణమాఫీ కాలేదని బండి విమర్శించారు. స్థానిక ఎన్నికల కోసమే కాంగ్రెస్ రుణమాఫీ డ్రామా అని ఆరోపించారు.

### బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేద్దాం

బీజేపీ, కాంగ్రెస్ తిట్టుకోవడం మానేసి కలిసి పనిచేద్దామని బండి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు బీజేపీని, మోదీని విమర్శించడం మానుకోవాలని, కేంద్ర సహకారం కావాలంటే విమర్శలు వద్దని సూచించారు. తాను కూడా కాంగ్రెస్‌ను విమర్శించనన్నారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీరాములు, లక్ష్మారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు చిక్కుముడులు

- నాడు ఉమ్మడి రాష్ట్ర జనాభా లెక్కల ఆధారంగా ఏబీసీడీగా వర్గీకరణ
- క్షేత్రస్థాయిలో మారిన ఎస్సీ కులాల పరిస్థితులు
- ఊపందుకుంటున్న ఎస్సీ కులగణన డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై అందరి చూపు

హైదరాబాద్, ఆగస్టు4 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదంటూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణలో ఎలా అమలు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికప్పుడు ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చి రాష్ట్రంలో అమలు చేస్తామని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అది అంత సులువు కాదని, అనేక సవాళ్లు ఉన్నాయని దళిత మేధావులు అభిప్రాయపడుతున్నారు. సవాళ్లను అధిగమించాలంటే సమగ్ర కులగణన ఒక్కటే పరిష్కారమని చెప్పుతున్నారు.

### కమిషన్ వేస్తారా?

ఎస్సీలకు రాజ్యాంగబద్ధంగా 15% రిజర్వేషన్ అమలవుతున్నది. ఆ కోటాలో మాలలే ఎక్కువగా లబ్ధి పొందుతున్నారంటూ మాదిగలు పోరాటబాట పట్టడంతో 1995లో అప్పటి ప్రభుత్వం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించింది. మాదిగల వాదనను సమర్థిస్తూ ఆ కమిషన్ 1996లో నివేదిక సమర్పించింది. దాని ఆధారంగా ఎస్సీ కోటాను ఏ, బీ, సీ, డీగా విభజించారు. 2000లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరిస్తూ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం చేసింది. అయితే ఆ అధికారం రాష్ట్రాలకు లేదంటూ సుప్రీంకోర్టు 2004లో కొట్టివేసింది. అనంతరం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఉషా మెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసింది. రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రాలు కులాల వర్గీకరణను చేపట్టవచ్చని కమిషన్ సిఫారసు చేసింది. అది అమలుకు నోచుకోలేదు. అవేవీ లేకుండానే ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని తాజాగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వర్గీకరణను అమలు చేయాలంటే ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని న్యాయకోవిదులు అభిప్రాయపడుతున్నారు. సామాజిక, ఆర్థిక వెనకబాటుతనాన్ని తొలగించి, సమాన అవకాశాలను కల్పించాలన్నదే రాజ్యాంగంలోని అధికరణలు 15, 16 ఉద్దేశమని వివరిస్తున్నారు. ఎస్సీల్లోని కులాలవారీగా అసమానతలను గుర్తించాలని, ఆ తరువాతే ఏబీసీడీల వర్గీకరణ సాధ్యమవుతుందని చెప్తున్నారు.

### రాష్ట్రంలో కొన్ని కులాలు లేనేలేవు

తెలంగాణలో అధికారికంగా గుర్తింపు పొందిన ఎస్సీ ఉపకులాల సంఖ్య 59. 'ఏ' గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలు సహా మొత్తం 12 కులాలను కలుపుతూ వారికి 1% కోటా ఇచ్చారు. వాటిని అట్టడుగు స్థానంలో ఉన్న కులాలుగా గుర్తించారు. 'బీ' గ్రూపులో మాదిగ, దాని ఉపకులాలు మొత్తం 18 కులాలను చేరుస్తూ వారికి 7% కోటా, 'సీ'లో మాల, దాని ఉపకులాలు మొత్తం 25 కులాలను చేరుస్తూ వారికి 6% కోటా, 'డీ'లో ఆది ఆంధ్రులతోపాటు మొత్తం 4 కులాలను చేర్చి, 1% కోటా నిర్ణయించారు. అయితే ప్రస్తుతం ఇందులోని కొన్ని కులాలు రాష్ట్రంలోనే లేవని దళిత మేధావులు చెప్తున్నారు.

### ఉపకులాలకు సర్టిఫికెట్లేవీ?

తెలంగాణలో మొత్తం 59 ఎస్సీ కులాల్లో మాల, మాదిగ మినహా 57 ఉపకులాలున్నాయి. దశాబ్దాలుగా 52 ఉపకులాలకు సర్టిఫికెట్లే జారీ చేయని పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొన్నది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు ఎదురవుతున్న సవాళ్లన్నింటికీ కులగణన ఒక్కటే పరిష్కారమని దళిత మేధావులు స్పష్టంచేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీల సంఖ్య 54.08 లక్షలు. 2014లో ఆ సంఖ్య 64.44 లక్షలుగా తేలింది. ఇప్పటివరకు జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలుగా గణిస్తున్నారే తప్ప ఉపకులాల వివరాలకు, సామాజిక, ఆర్థిక స్థితిగతులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఏబీసీడీ వర్గీకరణను అమలు చేయాలంటే సుప్రీంతీర్పు ప్రకారం ముందుగా ఎస్సీ జాబితాలోని కులాల లెక్క తీయాల్సి ఉంటుంది. ఎస్సీ వర్గీకరణ అంశం అనేక సవాళ్లతో కూడుకుని ఉండటంతో అందరి చూపు ప్రభుత్వం వైపే ఉన్నది.

### కులగణన చేపట్టాల్సిందే

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను అందరూ స్వాగతించాల్సిందే. ఇందుకోసం ప్రభుత్వం ఎస్సీ కులగణనను నిర్వహించాలి. ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా ఎక్కువగా మాల, మాదిగకులాలే పూర్తిగా లబ్ధిపొందాయి. ఇతర వెనకబడ్డ 57 ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయి. ఏ ఒక్క కులానికి మరో కులం ఉపకులం కాదు.

**-వెంకటేశం, ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు**

### వర్గీకరణతో సమాన అవకాశాలు కల్పించాలి

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎస్సీల్లోని అన్ని కులాలు సమాన అవకాశాలను పొందేందుకు మార్గం సుగమమైంది. ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పు అమలుకు చర్యలు చేపట్టాలి. తీర్పు అమలుకు మొట్టమొదటగా రాష్ట్రంలోని ఎస్సీ కులాల జనాభా లెక్కలను, ఆర్థిక, సామాజిక స్థితిగతులను వెలికితీయాలి.

**- డాక్టర్ శ్రీనివాస్, ఎస్సీ మేధావుల ఫోరం అధ్యక్షుడు**

### ఎస్సీ ఉప వర్గీకరణ తీర్పుపై అప్పీల్ చేస్తాం

**కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్**

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఎస్సీ రిజర్వేషన్లను ఉప వర్గీకరించేందుకు రాష్ట్రాలకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్టు 'లోక్ జనశక్తి పార్టీ' (రామ్‌విలాస్) నేత, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలు చేయనున్నట్టు స్పష్టం చేశారు. దళితుల కోటాలో క్రీమీలేయర్‌ను తీసుకురావటాన్ని కూడా వ్యతిరేకిస్తున్నామన్నారు. దళితులకు క్రీమీలేయర్ నిబంధనను వర్తింపజేసేలా ఎలాంటి ప్రయత్నం జరిగినా, దానిని అడ్డుకుంటామని కేంద్రమంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రామ్‌దాస్ అథవాలే హెచ్చరించారు. అయితే ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణతో.. వారిలో అత్యంత వెనుకబడిన వారికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

**బాలికను తల్లిదండ్రులకు అప్పగింత • పోలీసుల అదుపులో కిడ్నాపర్**

అబిడ్స్, ఆగస్టు 4 : హైదరాబాద్‌లోని కట్టెలమండిలో కిడ్నాప్‌కు గురైన చిన్నారి కథ సుఖాంతమైంది. కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్‌యాదవ్.. ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్‌తో కలిసి వెల్లడించారు. బేగంబజార్ ఛత్రి ప్రాంతానికి చెందిన ప్రియాంక తన సోదరుని కూతురు(6)ను తీసుకుని శనివారం మధ్యాహ్నం అబిడ్స్ కట్టెలమండిలోని పుట్టింటికి వెళ్లింది. అక్కడ తన సోదరి కుమారుడు(4)తో కలిసి స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆడుకునేందుకు వెళ్లగా, బాలిక తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా చిన్నారి గుర్తుతెలియని వ్యక్తితో కలిసి ఆటోఎక్కినట్టు గుర్తించారు. ఆటోనంబర్ ఆధారంగా పోలీసులు డ్రైవర్‌ను విచారించగా అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో దింపినట్టు చెప్పాడు. అక్కడ సైతం సీసీ కెమెరాలను పరిశీలించగా జహంగీర్‌పీర్ దర్గాకు వెళ్తున్న బస్సులో వెళ్లినట్టు కనిపించింది. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టగా కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ సమీపంలో బాలికను తీసుకెళ్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నారికి వైద్య పరీక్షలు చేయించి తల్లిదండ్రులకు అప్పగించగా, కిడ్నాపర్‌ను అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కిడ్నాపర్ బీహార్‌కు చెందిన మహ్మద్ బిలాల్ అన్సారీగా గుర్తించారు.

# దళిత మహిళపై పోలీసుల దాష్టీకం

మొదటిపేజీ తరువాయి...

నివాసముండే నాగేందర్ ఇంట్లో 22 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీకి గురైందని గత నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి పక్కన కూలి పనిచేసుకొని బతికే సునీత, భీమయ్య దంపతులను అనుమానించాడు. కేసు నమోదు చేసుకున్న షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి బృందం.. భీమయ్య, సునీతను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ రోజు భీమయ్యను వదిలేసి 9వ తరగతి చదువుతున్న వాళ్ల కొడుకును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి, తల్లితో పాటు లాకప్‌లో కూర్చోబెట్టారు. దొంగతనం ఒప్పుకోవాలంటూ థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్టు బాధితురాలు తెలిపింది. తన కొడుకు ముందే బట్టలు విప్పించి, చెడ్డీ తొడిగి కాళ్ల మధ్య కర్రలు పెట్టి బూటు కాళ్లతో తొక్కుతూ చిత్రహింసలకు గురిచేశారని, కొడుకును కూడా అరికాళ్లపై రబ్బర్ బెల్ట్‌తో కొట్టారని, పోలీసుల దెబ్బలకు తాళలేక మూర్ఛపోతే తన కొడుకుతో జండూబామ్ రాయించి, ఫిర్యాదు చేసిన వ్యక్తి కారులోనే ఇంటికి పంపించారని వివరించింది. అనారోగ్యంతోనే వారం పాటు తాము ఇంట్లో నుంచి బయటకు రాలేదని, లాకప్ విషయాన్ని ఎవరికీ చెప్పొందంటూ పోలీసులు బెదిరించారని వాపోయింది. 'నైటు తీస్కపోయి ఫస్టు మా ఆయినను కొట్టిన్రు.. ఆయనను బయటకు పంపి నన్ను దీస్కపోయిన్రు. బట్టలన్నిప్పేశిర్రు. ఆఫ్ నిక్కరేశి ఎడ్మకాలు అక్కడ జాపిర్రు.. కుడికాలు ఇక్కడ జాపిర్రు.. కట్టోటి పెద్దదివెట్టి చేతులు ఎన్కకుగట్టేశి కాళ్లు జాపిపిచ్చిర్రు. కాళ్లు కట్టేశి ఓ పెద్ద కట్టెవెట్టి ఓ సారు ఇక్కడ కాలువెట్టిండు.. ఓ సారు కట్టెమీద కాలు వెట్టిండు. మేడం మధ్యల నిలవడి నెత్తిరికిచ్చుకున్నది. ఒగసారును ఎన్కగూసుండవెట్టిర్రు. ఇగ కొడ్తా వుండ్రు సారూ.. అంత ఘోరం మాత్రం కొట్టొద్దు సారూ.. మస్తు గొట్టిర్రు సారూ.. బట్టలిప్పిగొట్టిర్రంటే ఆడపిల్లను. నేను చేయని శిక్ష అనుభవిస్తున్న.. నాకివి ఒద్దు సారూ.. మీ కాళ్లు మొక్కి పదిరూపాలడుక్కొని బతుకుతగానీ, నేనిట్లాంటి పనిజేయను, నాకు ఎన్క ఆపిరేషనైంది. నా మొగనికి పానం మంచిగలేదు. నాకు కాలిరిగిపోయింది సారు అంటెగుడ నమ్ముతలేరు సార్. ఒక సారేమో ఎదను ఏశీ ఏశీ తన్నిండు. దమ్మొస్తుంది నాకు మాట్లాడాలంటే. ఇష్టమొచ్చినట్టు పట్టపట్ట శెయితోని కొట్టిర్రు. కాలు దగ్గరికి గుంజుకుంటే.. కాలు దగ్గరికి గుంజుకుంటున్నవేమే? అంట మళ్ల కట్టేసి కొట్టిర్రు సారు. తొమ్మిదీటి నుంచి రెండు గంటల వరకు కొట్టుడూ నడిపియ్యుడు.. కొట్టుడూ నడిపియ్యుడూ! నాకు నడ్వనీకొస్తలేదు. నోరెండుకపోతున్నది. కొంచం నీళ్లతడి చెయ్యిర్రంటే.. కొంచెం నీళ్ల తడి చేస్తుర్రు, కొడుతుర్రు. ఓంబత్తీలు తెచ్చి కొడ్దము కాల్చియ్యి అని సారువాళ్లంటే ఇట్లొంటిదానికైతే నేనెళ్లిపోతా అని మేడం ఎళ్లిపోయింది. ఎందుకెళ్లిపోతున్నవ్ నువ్ రా నువ్ రా జరసేపు రా అని మేడానికి ఫోన్ జేసి రమ్మంటే నేనుండను మీరట్లజేస్తానంటే అని ఆ మేడం ఎళ్లిపోయింది సారు. అందరు మొగ పోలీసోళ్లే కొట్టిన్రు.. ఒక్క ఆడపిల్ల మాత్రం నన్ను కొట్టలేదు. శేతులు ఏం అననీకొస్తలేవు. కాళ్లు దగ్గరికొస్తలేవు. శేతులు ఇట్ల వెట్టిపిచ్చి గాజులన్ని పీకిన్రు. ఆ దెబ్బలకు ఓపెనైపోయి ఎవరెవరియో పేర్లు గుడ చెప్పిన్నంట. నాకైతె మతిలేదు సారూ. మీ కాళ్లు మొక్కుత నన్నెట్లనో బైటెయ్యిర్రి. ఈ దొంగతనం జేసినట్టుంటే నేనాన్నే సచ్చిపోత సారు. కని ఆళ్లింట్లకెళ్లి మాత్రం సక్కగ ఎంక్వైరీ చేసుకొచ్చి నా ఇంట్ల ఎవరు వెట్టిర్రో అదొక్కరు గుర్తుదేల్చుమను, నేను దీశినట్టుంటే నేను మీముందట్నే సచ్చిపోత సారు నేను. పెద్దసారనేటోళ్లు ఎవరో ఎమ్మో. పెక్కపెక్క తన్నిర్రు. దమ్మెల్లలేదని నిన్న దావఖానకు పోదామని అనుకున్నం. బైటికెళ్లనిస్తలేరాళ్లు. పిట్రోల్‌వోశి అంటువెడుతం బిడ్డా.. నువ్వెట్ల బైటికెళ్తవు? నీ మొగొన్ని నిన్ను. నీ బిడ్డని, నీ కొడుకును పిట్రోల్ పోశి అంటువెడ్తం.. నువ్వెట్ల బైటికెళ్తవో సూస్తనే.. మా బంగారం మాకు దెచ్చియ్యే అనంటే నేనేంజేత్తు సారు' అని బాధితురాలు మీడియా ఎదుట తన గోడువెళ్లబోసుకున్నది.

### బాధ్యులెవరైనా తప్పించుకోలేరు

షాద్‌నగర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయం వెళ్లడంతో వెంటనే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఘటనతో సంబంధం ఉందని భావించిన వారిని అక్కడి నుంచి తప్పించి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేయాలని ఆదేశించారు.

### సీపీ కార్యాలయానికి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్

థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డిని సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామిని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి ఆదివారం రాత్రి ఆదేశించారు. నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: బత్తి

షాద్‌నగర్, ఆగస్టు4: సునీతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన షాద్‌నగర్ పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బత్తి వెంకటయ్య, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతమ్ కోరారు. ఆదివారం షాద్‌నగర్ సర్కార్ దవాఖానలో వైద్యం పొందుతున్న బాధితురాలిని పరామర్శించిన అనంతరం వారు మాట్లాడుతూ.. కూలి పనులు చేసుకొనే దళిత మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టడం దారుణం అని అన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

### ఈ దౌర్జన్యం ఇంకెంతకాలం?

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తం చేశారు. ఆదివారం ఓ ప్రకటనలో పోలీసుల దౌర్జన్యకాండపై మండిపడ్డ ఆయన.. పోలీసుల అధికార దుర్వినియోగం, మానవ హక్కుల ఉల్లంఘనను ఖండించారు. ప్రభుత్వం మానవ హక్కులను కాపాడటంలో విఫలమైందని, పోలీసుల అధికార దుర్వినియోగమే నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఘటనపై దర్యాప్తుచేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళపై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై సీఎంవో, డీజీపీ వెంటనే స్పందించాలని ఎక్స్ వేదికగా విన్నవించారు.

# నేరస్థులకు శిక్షలు తప్పవు

- మహిళలు, చిన్నారులపై నేరాలను సహించేది లేదు
- పోక్సో కేసుల్లో సత్వర న్యాయానికి చర్యలు : డీజీపీ



హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : నేరస్థులకు శిక్షలు తప్పవని డీజీపీ జితేందర్ హెచ్చరించారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థ న్యాయ సూత్రాలను పాటిస్తూ మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తీవ్రమైన నేరాలను గుర్తించి వాటి దర్యాప్తు, శిక్షల పర్యవేక్షణకు దృఢమైన వ్యవస్థను అనుసరిస్తున్నట్టు వెల్లడించారు. గత ఐదేండ్లుగా విచారణలో కేసులకు సంబంధించి శిక్షలు పడినట్టు డీజీపీ తెలిపారు. అత్యాచారం, పోక్సో కేసుల్లో 15 మందికి 20 ఏండ్లు, మరో రెండు కేసుల్లో ఇద్దరికి 25 ఏండ్లు, 11 మందికి జీవిత ఖైదువిధించినట్టు వెల్లడించారు. హైదరాబాద్, రాచకొండలో కమిషనరేట్ల పరిధిలో ఐదు చొప్పున శిక్షలు విధించినట్టు తెలిపారు.

### ఆ కలినాత్ములకు జీవితఖైదు..

'హైదరాబాద్‌లో ఓ కసాయి తండ్రి తన కూతురిపై అనేకసార్లు లైంగికదాడి చేసినందుకు అతనికి జీవితఖైదు పడింది. మరో కేసులో తన కూతురిపై లైంగికదాడి చేసిన తండ్రికి 25 ఏండ్ల శిక్ష, ఆదిలాబాద్‌లో ఓ బాలుడిపై అసహజ లైంగిక నేరం చేసిన నిందితుడికి 20 ఏండ్ల శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించారు. 2017లో నార్సింగి పోలీస్ స్టేషన్ చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుడికి ఎంఎస్‌జే కోర్టు తాజాగా మరణశిక్ష పడినట్టు డీజీపీ వివరించారు.